జగ్గంపేటలో వరుణ్‌తేజ్ సందడి

ప్రజాశక్తి - జగ్గంపేట

అభివాదం చేస్తున్న వరుణ్‌తేజ్

మెగా ప్రిన్స్ హీరో వరుణ్‌తేజ్ నటించిన మట్కా సినిమా ప్రమోషన్‌లో సోమవారం జగ్గంపేట విచ్చేశారు. శ్రీ వీరాంజనేయ ఫిలిమ్స్ అధినేత కొత్త చిన్న వీరభద్రరావు, బూర్లు సాయి ఆధ్వర్యంలో జెవిఆర్ కాంప్లెక్స్ వద్ద వరుణ్‌తేజ్‌కు ఘనంగా స్వాగతం పలికారు. అలాగే వరుణ్‌తేజ్‌కు జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్, తుమ్మలపల్లి చందు సాలువా కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వరుణ్ తేజ్ జగ్గంపేట రావడంతో మెగా అభిమానులు ఆయనతో ఫోటోలు తీసుకునేందుకు ఎగబడ్డారు.

తొలి బడ్జెట్‌లోనే నిరాశ

- ఎండమావిలా సూపర్ సిక్స్ పథకాలు
- కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైన్‌పై లేని ప్రస్తావన
- ఉమ్మడి జిల్లాల్లో సమస్యలు తిష్ట

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

కూటమి ప్రభుత్వం తొలి బడ్జెట్‌లోనే నిరాశ పరిచింది. గత వైసిపి ప్రభుత్వం ఆర్థిక అరాచకాలకు పాల్పడిదంటూ 2024 ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు ఎండగట్టిన విషయం విదితమే. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దుతామంటూ అనేక హామీలు గుప్పించారు. సూపర్ సిక్స్ పథకాల పేరు చెప్పి ప్రజలను ఆశల పల్లకి ఎక్కించారు. తాజా బడ్జెట్‌లో కేటాయింపులకు అవసరాలకు పొంతనే లేదంటూ విశ్లేషకులు తేల్చి చెబుతున్నారు. బడ్జెట్ సమావేశాలు మొత్తంగా తొలిరోజు ఆత్మస్తుతి పరనింద అనే చందంగా సాగిందని చెప్పడంలో అతిశయోక్తి లేదని స్పష్టమవుతోంది. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ మరోసారి జిల్లా వాసులను నిరాశ పరిచింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలకు తగిన నిధులు కేటాయించకపోవడంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కూటమి అభ్యర్థులు క్లీన్ స్వీప్ చేసేంతలా జిల్లా వాసులు బ్రహ్మరథం పట్టారు. ఈ నేపథ్యంలో బడ్జెట్‌పై జిల్లా వాసులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, సాగునీటి పారుదల రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వలేదు. కోనసీమ రైల్వే లైన్‌కు రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించాల్సి ఉంది. ప్రతి బడ్జెట్‌లోనూ నిరాశే ఎదురవుతోంది. ఈసారి కూడా నిధుల మాట ఎత్తలేదు. ముఖ్యమైన పర్యాటక, పారిశ్రామిక అభివృద్ధిపై కూడా సారీ అనేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూనే పథకాల అమలుకు నిధులు కేటాయింపులపై స్పష్టత ఇవ్వలేదు. గత ప్రభుత్వం ఉప్పాడ హార్బర్ పనులకు నిధులను కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. కానీ ఈ ప్రాజెక్టుకు ఇప్పటి వరకూ 40 శాతం నిధులనే కేటాయించగా ఈ బడ్జెట్‌లో మిగిలిన నిధుల గురించి ప్రస్తావన రాలేదు .ఇలా పలు అంశాలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో జిల్లా వాసులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. కీలకమైన కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైను పూర్తి కావడం కోసం కోనసీమ ప్రజానీకం గత 22 ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం దఫదఫాలుగా రైల్వే బడ్జెట్‌ల్లో మొత్తం రూ.1100 కోట్లు కేటాయించింది. మొత్తం నిర్మాణ వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం వాటా ఇవ్వాల్సి ఉంది. సుమారు రూ.350 కోట్లు రాష్ట్ర వాటా ఇవ్వాల్సి ఉంది. అనేక వినతులు ఇవ్వగా 55 కిలోమీటర్ల పొడవునా ఉన్న ఈ లైన్‌కు భూ సేకరణ చేస్తామని అందుకు అయ్యే ఖర్చును భరిస్తామని గత ప్రభుత్వం రైల్వేకు గతంలోనే తెలిపింది. భూ సేకరణ నిధుల కేటాయింపుపై గతంలో ఇచ్చిన హామీ మేరకు ప్రాజెక్టు కొనసాగింపుగా ఈ బడ్జెట్‌లో నిధుల మాట ఎత్తలేదు. విశాఖ-కాకినాడ మధ్య పెట్రో రసాయనాల పెట్టుబడుల కేంద్రం వస్తుందని కాకినాడ జిల్లా వాసులు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నారు. కాకినాడ సెజ్‌లో నేటికీ పరిశ్రమల జాడ కనిపించడం లేదు. జిల్లా కేంద్రాలైన రాజమహేంద్రవరం, కాకినాడ వంటి ప్రధాన పట్టణాలలో తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. గోదావరి జలాలను నిడదవోలు, కొవ్వూరు పట్టణ వాసులకు అందిస్తామంటూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ఆచరణలో నిధుల కేటాయింపునకు నోచుకోలేదు. జిల్లాలో పలు రహదారుల పనులకు భారీగా సొమ్ములు కేటాయించాల్సి ఉంది. గతంలో నిధులను కేటాయించామని ప్రభుత్వం చెప్పిన నాటి నుంచి ఇప్పటివరకు రహదారుల పరిస్థితి అధ్వానంగానే ఉంది. కాకినాడలో విడుదలయ్యే 50 మిలియన్ లీటర్ల వ్యర్థ జలాలను శుద్ధి చేసేందుకు గతంలో రూ.10 కోట్లు వెచ్చించాలి. కానీ నిధులను కేటాయించక పనులు ప్రారంభం కాలేదు. గోదావరి డెల్టా ఆయకట్టులో వేసవిలో నీటి లభ్యత సమస్య తీవ్రంగా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో గోదావరి డ్రైన్ల ఆధునీకరణ పనుల చేయాల్సి ఉన్నా నిధులు కేటాయించలేదు. ఇలా పలు అంశాలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో జిల్లా వాసులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. తూర్పు గోదావరి జిల్లాకు సంబంధించి ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ గేట్ల ఆధునికీకరణకు నిధులు కొరత వెంటాడుతోంది. తొలి బడ్జెట్లో కూడా నిధులు కేటాయింపు లేదు. దాదాపు 10 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే కీలకమైన గేట్ల ఆధునీకరణను విస్మరించడంతో ఉమ్మడి జిల్లా వాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా విస్మరించడంతో జిల్లా రైతాంగం తీవ్ర అసహనం వ్యక్తం చేస్తుంది. స్థూల ఆదాయంపై అంకెల గారడీ వినిపించారు. నూతన జిల్లాల ఏర్పాటులో భాగంగా ఏర్పడిన తూర్పు గోదావరి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అభివృద్ధి కోసం ఏ రకమైన నిధులూ బడ్జెట్లో కేటాయించలేదు. పారిశ్రామిక రంగానికి దూరంగా ఉన్న ఈ జిల్లాని ఆ దిశగా అభివృద్ధి చేయాలని ఆలోచన ఏ కోశానా కనబడలేదు. కోనసీమలో ఇరిగేషన్ డ్రైనేజీల అభివృద్ధి కోసం నిధులు కేటాయించలేదు. ఈ జిల్లాలో 1.36 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగవుతుంది. కొబ్బరి సాగులో రాష్ట్రంలోనే జిల్లాది మొదటి స్థానం. ఇక్కడి ఉత్పత్తుల విలువ సుమారు రూ.736 కోట్లుగా ఉండగా ప్రత్యక్షంగా లక్ష మంది, పరోక్షంగా మరో 3 లక్షల మందికిపైగా ఉపాధి పొందుతున్నారు. కొబ్బరి ఆధారిత పరిశ్రమల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం కరువైంది.

టీచర్స్ ఎంఎల్‌సి ఎన్నికలకు నోటిఫికేషన్

- నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి
- ఈ నెల 18 వరకూ దాఖలుకు అవకాశం
- 19 న పరిశీలన, డిసెంబర్ 5న పోలింగ్, 9న కౌంటింగ్

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదలయ్యింది. తూర్పు, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ఎంఎల్‌సి ఎన్నికకు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం ఎన్నికల నోటీసు జారీ చేశారు. ఈ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు కాకినాడ కలెక్టర్ కార్యాలయంలోని కోర్టు హాల్లో నామినేషన్లు అందజేయవచ్చునని ఆయన తెలిపారు. ఈ నెల 11 తేదీ నుంచి 18 వరకూ పని దినాల్లో ఉదయం 11 గంటల నుండి మధ్నాహ్నం 3 గంటల మధ్య రిటర్నింగ్ అధికారి లేదా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారికి తమ నామినేషన్లు దాఖలు చేసుకోవాలని తెలిపారు. నామినేషన్ పత్రాలను ఈ నెల 19న ఉదయం 11 గంటలకు పరిశీలిస్తారన్నారు. 21న గడువు ఉంటుందన్నారు. డిసెంబరు 5న ఉద మధ్నాహ్నం 3 గంటల వరకూ నామినేషన్ల ఉపసంహరణకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య పోలింగ్ జరుగుతుందని, 9న కౌంటింగ్ నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు.

16,316 మంది ఓటర్లు

ప్రచురించిన తుది జాబితా ప్రకారం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలో 16,316 మంది టీచర్ ఓటర్లు నమోదయ్యారు. నామినేషన్ ఫారాల సరఫరా, ఇతర సమాచారం, సామగ్రి అందించేందుకు ఈ నెల 11 నుంచి కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ అందుబాటులో ఉంచారు. ప్రజలకు సమాచారం కోసం కాల్ సెంటర్ కూడా ఏర్పాటు చేసిన అధికారులు 1950 టోల్‌ఫ్రీ నెంబరును కేటాయించారు. ఈ నెల 11 నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందని అధికారులు ప్రకటించారు.

ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ

ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు కాకినాడ కలెక్టర్ కార్యాలయంలోని కోర్టు హాలులో ఈ నెల 11 నుంచి 18 వరకు అన్ని పని దినాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ తమ నామినేషన్లు ఫారం-2ఇలో దాఖలు చేసుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థి నామినేషన్‌తో పాటు ఫారమ్-26లో నోటరీ చేయించిన అఫిడవిట్ సమర్పించాలి. అన్ని కాలమ్‌లు విధిగా నింపాల్సి ఉంటుంది. నామినేషన్‌ను 10 మంది తూర్పు-పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎంఎల్‌సి నియోజకవర్గ ఓటర్లు ప్రతిపాదించాల్సించి ఉంటుంది. రాజకీయ పార్టీల తరపున పోటీ చేసే అభ్యర్థులు ఫారమ్- ఎఎ, ఫారమ్- బిబి సమర్పించాలి. అభ్యర్థి వయస్సు 30 కంటే తక్కువగా ఉండకూడదు.

రిటర్నింగ్ అధికారిగా కలెక్టర్

ఉభయ గోదావరి జిల్లాల ఎంఎల్‌సి నియోజకవర్గ ఎన్నికలకు కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి రిటర్నింగ్ అధికారిగా, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా కాకినాడ జిల్లా డిఆర్‌ఒ జె.వెంకటరావు,, పశ్చిమ, ఏలూరు, తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల డిఆర్‌ఒలు వ్యవహరిస్తారు. జిల్లాలో ఎంసిసి పర్యవేక్షణకు మెప్మా పీడీని నోడల్ ఆఫీసర్‌గా నియమించారు. ఫ్లయింగ్, స్టాటిక్ సర్వయిలెన్స్ బృందాలతో చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు.

నేడు పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి నామినేషన్

గోపిమూర్తి

ఉపాధ్యాయ, అధ్యాపక, ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ టీచర్స్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపిమూర్తి మంగళవారం కాకినాడలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. అనంతరం బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. అభ్యర్థి ఉదయం 7.30 గంటలకు భీమవరం నుంచి ర్యాలీగా బయలుదేరుతారు. ఏలూరు జిల్లా, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం, మండపేట, రామచంద్రపురం మీదుగా ఉదయం 11.30 గంటలకల్లా కాకినాడ చేరుకుంటారు. స్థానిక అన్నమ్మ ఘాటీ నుంచి వాహనాలతో ర్యాలీగా బాలాజీ చెరువు సెంటర్ మీదుగా మధ్నాహ్నం 12 గంటలకు కలక్టరేట్‌కు చేరుకుంటారు. నామినేషన్ అనంతరం ధర్నా చౌక్ లేదా లేడీస్ క్లబ్ ప్రాంగణంలో బహిరంగ సభ ఉంటుంది.

అర్ధనగ్నంగా క్లాప్ డ్రైవర్ల ర్యాలీ

ప్రజాశక్తి - కాకినాడ

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న క్లాప్ వాహన డ్రైవర్లు

3 నెలల బకాయి జీతాల కోసం క్లాప్ వాహన డ్రైవర్లు నిక్కర వేసుకుని, మొలకు వేప కొమ్మలు కట్టుకుని అర్ధ నగ్నంగా ర్యాలీ నిర్వహించారు. సోమవారం నాటికి క్లాప్ డ్రైవర్ల ఆందోళన 18వ రోజుకు చేరింది. స్థానిక అర్బన్ రెవెన్యూ కార్యా లయం నుంచి కలెక్టరేట్ వరకూ నిరసన ర్యాలీ నిర్వహించిన అనంతరం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్య క్షులు దువ్వా శేషబాబ్జి, సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ మాట్లాడుతూ క్లాప్ వాహన డ్రైవర్ల బకాయి జీతాల కోసం ఆందోళన చేపట్టి 18 రోజులు అయిన నేటికీ వీరి సమస్యల పరిష్కా రానికి అధికారులు చొరవ చేయటం లేద న్నారు. అధికారుల తీరు ఇదేవిధంగా ఉంటే క్లాప్ వాహన డ్రైవర్ల పోరాటానికి మద్దతుగా సిఐటియు సంఘాలన్నీ పోరాటంలోకి దిగు తాయని హెచ్చరించారు. నేడు అర్ధ నగ్న ప్రదర్శన చేశారని, జీతాలు వేయించడంలో ప్రభుత్వం, అధికారులు చొరవ చేయకపోతే నగ్నంగా ప్రదర్శన చేయుటకు అయినా కార్మికుల సిద్ధంగా ఉన్నాం`న్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్, శివశంకర్, గంగాధర్, రాజు, దుర్గా ప్రసాద్, ఆర్ వెంకటేష్, శివ, భద్ర, రమణ, కుమార్, రాజేష్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజాపోరులో మాట్లాడుతున్న సిపిఎం నేత శేషబాబ్జి

ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను పర్మినెంట్ చేయాలని సిపిఎం జిల్లా నాయకులు దువ్వా శేషబాబ్జీ, నగర కన్వీనర్ పలివెల వీరబాబు డిమాండ్ చేశారు. నగరంలోని 31వ డివిజన్ రాగంపేటలో ప్రజాపోరు క్యాంపెయిన్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి, మున్సిపల్ కార్పొరేషన్, జెఎన్‌టియుకె, తదితర ప్రభుత్వ శాఖల్లో ఏళ్ల తరబడి సేవలందిస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఏ రంగంలో పనిచేసే కార్మికులకైనా కనీస వేతనం రూ.26 వేల అమలు చేయాలన్నారు. కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో అక్రమంగా తొలగించిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను హైకోర్టు ఉత్తర్వులు ప్రకారం విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రయివేట్ విద్యాసంస్థలు, ఆసుపత్రుల్లో పనిచేస్తున్న సిబ్బందికి కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్‌ఐ తదితర కార్మిక చట్టాలు అమలు చేయాలన్నారు. ఈ నెల 15వ తేదీన ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు మలక వెంకటరమణ, దుంపల ప్రసాద్, సిహెచ్.వేణులతోపాటు ఎం.నాగలక్ష్మి, సిహెచ్.విజయకుమార్, ఆర్.తలుపులమ్మ, అనిత, శివశంకర్, తిలక్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నగర పంచాయతీ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కె.చిన్న, నందీశ్వరరావు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల విధులకు అవసరమైన పనిముట్లను అందించడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్నారని అన్నారు. అవసరమైన పని ముట్లు ఇవ్వాలని ఇప్పటికే మున్సిపల్ అధికారులకు తెలియచేసినా అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారని విమర్శంచారు. చెత్తను తీసుకెళ్లే మూడు చక్రాల బండి మరమ్మతులకు గురికావడంతో చెత్తను తరలించడం కష్టతరంగా మారిందన్నారు. అలాగే జనాభా పెరుగుదలకు అనుగుణంగా సిబ్బందిని నియమించాలని వారు డిమాండ్ చేశారు. కోవిడ్ కాలంలో పనిచేసిన కార్మికులకు చెల్లించాల్సిన 6 నెలల బకాయిలను చెల్లించాలని, చనిపోయిన బంగారు రాము కుటుంబానికి నష్టపరిహారంగా ప్రభుత్వం ఇస్తామన్నా రూ.2 లక్షలను తక్షణమే ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు నీలాపు ఏసమ్మ, బి,.సత్యవతి, సిహెచ్‌వి.రమణ, సిహెచ్.రామారావు, రాజు, జి.రాజులు, రాజమోహన్, పోలమ్మ, సింహాచలం వెంకటలక్ష్మి, రవి, దివ్యవాణి పాల్గొన్నారు

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ప్రగతి విద్యార్థి

ప్రజాశక్తి - సామర్లకోట

అవినాష్‌ను అభినందిస్తున్న యాజమాన్యం

జాతీయస్థాయి కబాడీ పోటీలకు స్థానిక ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థి సింగంపల్లి అవినాష్ ఎంపికైనట్లు ప్రగతి విద్యాసంస్థల ఛైర్మన్ నూతలపాటి పూర్ణచంద్రరావు తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 6, 7, 8 తేదీల్లో నెల్లూరు జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా టీం మొదటి స్థానం సాధించగా, టీంకు ప్రాతినిధ్య వహించిన ప్రగతి విద్యార్థి అవినాష్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనుటకు రాష్ట్రస్థాయి టీంలో చోటు సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థి అవినాష్‌కు ఛైర్మన్ పూర్ణచంద్రరావు, కళాశాల ఎజిఎం ఎస్.అనిల్‌బాబు, కళాశాల ఎఒ సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపల్ జి.నాగబాబు స్వీట్లు తినిపించి అభినందించారు. అవినాష్ తల్లిదండ్రులు శ్రీనివాస్, స్వప్న మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి ఆటలు పట్ల ఆసక్తి కనపరచడంతో కబడ్డీ ఆడటానికి ప్రోత్సహించినట్లు తెలిపారు.

అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - గండేపల్లి

బెలూన్లు ఎగురవేస్తున్న నిర్వాహకులు

సూరంపాలెం ఆదిత్య ప్రాంగణంలో జెఎన్‌టియుకె సెంట్రల్ జోన్ మెన్ అండ్ విమెన్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభోత్సవ సభకు ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియుకె స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ జి.శ్యాంకుమార్, అంతర్జాతీయ అథ్లెటిక్ పిపి.వరప్రసాద్, రాష్ట్ర పిఇటి అసోసియేషన్ నాయకులు నూకరాజు బెలూన్లు ఎగరవేసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ సోమవారం, మంగళవారాల్లో జరిగే వివిధ రకాల పోటీల్లో క్రీడాకారులు స్ఫూర్తిదాయకమైన ప్రదర్శనలు చేసి విజేతలుగా నిలవాలని సూచించారు. ఈవెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ రవి మాట్లాడుతూ అథ్లెటిక్స్ విభాగంలో వివిధ పోటీలో పాల్గొనేందుకు 350 మందికి పైగా క్రీడాకారులు వచ్చినట్లు తెలిపారు. ఉదయం జరిగిన పోటీల్లో విజేతలకు ఆదిత్య యూనివర్సిటీ ప్రో. ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి మెడల్స్‌ను ప్రధానం చేసి అభినందనలు తెలిపారు.

విమానాశ్రయానికి మా భూములు తీసుకోవద్దు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఆర్‌డిఒకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

అన్నవరం సమీపంలోని బెండపూడిలో విమానాశ్రయం నిర్మాణం కోసం తమ భూములు తీసుకోవద్దని ఆయా ప్రాంత రైతులు ఆర్‌డిఒ శ్రీరమణికి వినతిపత్రం అందజేశారు. సోమవారం రైతు పోరాట కమిటీ నేత మద్దుకూరి సుబ్బయ్య చౌదరి ఆధ్వర్యంలో బెండపూడి, అన్నవరం, చిన్నయ్యపాలెం గ్రామాల రైతులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమ గ్రామాల్లో భూములన్నీ రెండు పంటలు సాగు చేసే భూములని, అందరూ చిన్న, సన్నకారు రైతులమని తెలిపారు. గతంలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి భూములు ఇవ్వడం జరిగిందన్నారు. మళ్లీ ఇప్పుడు విమానాశ్రయం కోసం మిగిలిన భూములను తీసుకుంటే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఆర్‌డిఒ శ్రీ రమణి స్పందిస్తూ రైతుల సమస్యలన్నీ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తానని, రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు విశాలాక్షి, ఎంపిటిసి సభ్యులు భూసాల రమణ, ఉప సర్పంచ్ బొబ్బిలి వెంకన్న, దాసరి సత్యనారాయణ, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

కార్టూన్ 'నిజం'



ఘనంగా అబుల్ కలాం ఆజాద్ జయంతి

ప్రజాశక్తి - కాకినాడ, సామర్లకోట, పెద్దాపురం

నివాళులర్పిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

స్వాతంత్ర్య సమరయోధులు, భారతదేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో జరిగిన జయంతి వేడుకలో కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ముస్లిం, క్రైస్తవ మత పెద్దలు, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులతో కలిసి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ఉర్దూ ఉత్తమ ఉపాధ్యాయులను కలెక్టర్, ఇతర మత పెద్దలు సత్కరించారు. ఉర్దూ వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలకు గుర్తుగా ఆయన పుట్టినరోజును ప్రతి ఏడాది జాతీయ విద్యా దినోత్సవంగా, మైనారిటీ సంక్షేమ దినోత్సవంగా నిర్వహించుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్య క్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఎం.సునిల్ కుమార్, డిఇఒ పి.రమేష్, అడల్ట్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి వి.త్రిమూ ర్తులు, ముస్లిం ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎండీ.జవహర్ ఆలీ, ముస్లిం అడ్వకేట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. అలాగే సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్లో హెచ్‌ఎం తోటకూర సాయి రామకృష్ణ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.రాజు, కెవివి.సత్యనారాయణ, కె.శ్రీనివాస్, శ్రీవల్లి, డివిఆర్‌ఎస్ వల్లీ, ఎంవి.సత్య నారాయణ, పి.బ్రహ్మానందం, బేబీరాణి, భద్ర పాల్గొన్నారు. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో మౌలానా అబుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ కె.రామకృష్ణయ్య, ఎన్‌సిసి ఆఫీసర్ సనపల సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెకుముకి పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థుల ప్రతిభ

విజేతలతో శ్రీప్రకాష్ సీనియర్ ప్రిన్సిపల్ మూర్తి

ప్రజాశక్తి - కోటనందూరు

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ పోటీల్లో తమ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారని శ్రీప్రకాష్ విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపల్ ఎంవిఎస్‌ఎన్.మూర్తి తెలిపారు. తమ విద్యా సంస్థకు చెందిన ఎస్.కిరణ్(8వ తరగతి), ఎం.సాత్విక్ (9వ తరగతి), ఓ. సాయి శ్రావణ్‌జయదీప్ (10వ తరగతి) బృందం ద్వితీయ స్థానంలో గెలుపొందడం సంతోషంగా ఉందన్నారు. పాఠశాల, మండల, జిల్లాస్థాయిలలో గెలుపొంది రాష్ట్రస్థాయిపోటీలకు ఎంపికయ్యారని, రాష్ట్రస్థాయి పోటీలలో 52 బృందాలు పాల్గొనగా తమ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించడం హర్షణీయమని అన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్‌వికె.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక శాఖ గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకూ 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి ఆర్.వెంకటరాము సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వారోత్సవాలను ఎంఇఒ గంటా శ్యాంబాబు ప్రారంభిస్తారని, ఈ సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వం, దేశభక్తి గేయాలు, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొనేలా ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ పోటీల్లో విజేతలకు 20వ తేదీన బహుమతులు అందజేస్తామని అన్నారు.

బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ లింక్ తప్పనిసరి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలో ప్రతి ఒక్కరు బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ లింక్‌ను తప్పనిసరిగా చేసుకోవాలని ఎంపిడిఒ నాతి బుజ్జి తెలిపారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలు కొరకు లబ్ధిదారుని ఖాతాలో నేరుగా సొమ్మును జమ కావాలంటే బ్యాంక్ అకౌంట్‌కు ఎన్‌పిసిఐ లింక్ తప్పనిసరి అని అన్నారు. ఎన్‌పిసిఐ లింగ్ కాని వారు తప్పనిసరిగా బ్యాంకు అకౌంట్‌కు ఆధార్‌ను లింక్ చేసుకోవాలని సూచించారు. చేసుకోని వారు స్థానిక సచివాలయం వద్ద మంగళవారం ఉదయం 7 గంటల నుంచి పోస్టల్ అకౌంట్లు ఓపెన్ చేస్తారని, కావున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేరాలు ఘోరాలు

చోరీ కేసుల్లో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - సామర్లకోట

జల్సాలు, చెడు వ్యసనాలకు అలవాటు పడి వివిధ జిల్లాల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు సిఐ ఎ.కృష్ణభగవాన్, క్రైం సిఐ అంకబాబు తెలిపారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సంఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామానికి చెందిన జిల్లెల రాకేష్, పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం జి.కొత్తూరు గ్రామానికి చెందిన వాడల కృష్ణ సంయుక్తంగా తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడుతున్నారని తెలిపారు. వీరిద్దరిపై వివిధ జిల్లాల్లో 50కి పైగా దొంగతనం కేసులు ఉన్నాయన్నారు. మండలంలోని వేట్లపాలెం గ్రామంలో కుమ్మర వీధికి చెందిన గుర్రం సాయిబాబు నివాసంలో ఈ ఏడాది అక్టోబర్ 29న సుమారు 15 లక్షల విలువచేసే 186 గ్రాముల బంగారాన్ని నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చెడు వ్యసనాలు, జల్సాలకు అలవాటు పడి వీరు వ్యూహాత్మకంగా ఎంపిక చేసుకున్న ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి పక్కా వ్యూహంతో దోపిడీలు చేయడం అలవాటు చేసుకున్నారన్నారు. నేరాలు అదుపు చేసేందుకు వ్యాపార సంస్థల నివాసాల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఇల్లు వదిలి ప్రయాణాలు చేసేటప్పుడు ఎల్హెచ్ఎంఎస్ యాప్ లో ఆర్డర్ పెట్టుకోవాలని, ఆర్డర్ పెట్టుకోవడం తెలియకపోతే పోలీస్ స్టేషన్లో సంప్రదిస్తే ఎల్హెచ్ఎంఎస్ కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. అంతర్ జిల్లా దొంగల ముఠాను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన క్రైమ్ పార్టీ సభ్యులను ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు. అరెస్ట్ చేసిన ఇద్దరు నిందితులను కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని వారు తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని మల్లేపల్లి గ్రామానికి ఒక యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివనాగు తెలిపారు. యువతి వయస్సు 20 సంవత్సరాలు ఉంటుందని, ఈ నెల 8వ తేదీ రాత్రి ఇంటి నుంచి ఆమె వెళ్లిపోయినట్లు అమ్మాయి తల్లి ఇచ్చిన రిపోర్టుపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని మరలావ గ్రామంలో సోమవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జునరావు తెలిపారు. ఈ దాడుల్లో ఒక వ్యక్తి అక్రమంగా నిలవ చేసిన 6 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - మామిడికుదురు

మోటారు బైకులు చోరీకి పాల్పడుతున్న అల్లవరం మండలం ఓడలరేవుకి చెందిన పాత నేరస్టుడు నల్లి బాలకృష్ణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నగరం ఎస్ఐ చైతన్యకుమార్ తెలిపారు. నగరం, అమలాపురం, పాలకొల్లు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఐదు మోటారు బైకులు దొంగలించాడన్నారు. గతంలో రాజోలు పరిధిలో 27, అమలాపురం పరిధిలో 16 మోటారు బైకులు చోరీ చేసి జైలుకు వెళ్లి వచ్చాడన్నారు.

సారా తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - ఆలమూరు

నాటు సారా తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేశామని ఎక్సైజ్ సిఐ ఐడి.నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆలమూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మండపేట మండలంలోని ఏడిదలో స్కూటర్ మీద సారా తరలిస్తున్న ఆత్రేయపురం మండలం పేరవరానికి చెందిన యార్లగడ్డ ప్రసాద్, యార్లగడ్డ రాజును అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఈ దాడిలో 20 లీటర్ల నాటు సారాను, ఒక స్కూటర్ను సీజ్ చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - దేవరపల్లి

ఆగివున్న మూడు లారీలను ఒక లారీ ఢీకొన్న ప్రమాదంలో ఒక డ్రైవర్ మృతి చెందారు. దేవరపల్లి మండలం దుద్దుకూరు ఫ్లయ్ ఓవర్ దిగువలో రాజమహేంద్రవరం వైపు వెళుతున్న లారీ డ్రైవర్ దాని ముందు వెళ్తున్న సెప్టిక్ ట్యాంకర్‌ను వెనుక నుంచి ఢీకొని ఎడమ వైపు ఉన్న సర్వీస్ రోడ్ లోనికి వెళ్లి అక్కడ టైర్లు కొట్టు వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో లారీ క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్ సరికొండ అనంతరాజు (50) మృతి చెందినట్టు దేవరపల్లి ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఎదురెదురుగా ఢీకొన్న రెండు బస్సులు

ప్రజాశక్తి - సామర్లకోట

ఎదురెదురుగా వెళుతున్న రెండు బస్సులు ఢీ కొట్టుకోవడంతో మాధవపట్నం వద్ద కాకినాడ రోడ్‌లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సోమవారం ఉదయం సామర్లకోట వైపునుంచి కాకినాడ వెళుతున్న ఆర్‌టిసి బస్సు, కాకినాడ వైపునుంచి సామర్లకోట వైపు వస్తున్న ఒక ప్రయివేట్ కళాశాల బస్సులు మాధవపట్టణం గ్రామం వద్ద ఢీ కొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో విద్యార్థులు, ప్రయాణికులకు ఎటువంటి గాయాల కాలేదు. ప్రమాదం కారణంగా రోడ్డుకు మధ్యలో బస్సులు నిలిచి పోవడంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోగా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యాయి. ఉదయం కళాశాలలకు, ఉద్యోగాలకు హాజరయ్యే ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. సామర్లకోట ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

గ్రీవెన్స్‌కు 11 అర్జీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి 11 అర్జీలు అందాయని ఆర్‌డిఒ శ్రీరమణి తెలిపారు. అర్జీలను సంబంధిత కార్యాలయాలకు పంపించి వేగవంతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ సరిత, సిడిపిఒ జి.ఉష, ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ మాధవరావు, డిప్యూటీ తహశీల్దార్ భానుకుమార్ పాల్గొన్నారు.

యానాం వార్తలు

ఒఎన్‌జిసి ఇడికి వినతిపత్రం అందజేస్తున్న మల్లాడి కృష్ణారావు

ఒఎన్‌జిసి ఇడితో మల్లాడి భేటీ

ప్రజాశక్తి - యానాం

ఒఎన్‌జిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రత్నేష్ కుమార్‌తో సోమవారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఆర్‌ఎఒ మునిస్వామి కాకినాడలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న 231 మంది మత్స్యకారులకు సంబంధించిన నష్టపరిహారం 6,37,50,000ను ప్రభుత్వ ఖాతాలో జమ చేయాలని కోరారు. అర్హులైన మత్స్యకారులు 5520 మందికి ఇంకా విడుదల చేయాల్సిన ఐదు నెలల 14 రోజులకు సంబంధించిన నిధులను విడుదల చేయాలన్నారు. సిఎస్ఆర్ పనులకు సంబంధించి 25 పనులలో ఇప్పటికే 23 పనులకు టెండర్లు పిలవడం జరిగిందని తెలిపారు. జనవరి నెలాఖరు నాటికి చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి యుసిలు అందజేస్తామన్నారు. మరో 3, 4 రోజుల్లో పరిహారం నిధులను జమ చేసేందుకు ఒఎన్‌జిసి అధికారులు అంగీకరించారని అన్నారు.

పట్టాలు ఇచ్చారు..భూములు ఎక్కడ..?

ప్రజాశక్తి - యానాం

యానాం అంబేద్కర్ నగర్ గ్రామస్తులకు ఎస్‌సి సొసైటీ భూమిలకు సంబంధించి పట్టాలిచ్చి 25 సంవత్సరాలు అయింది. అయితే నేటికీ సంబంధిత లబ్ధిదారులకు నేటికీ భూములు చూపించలేదు. ఈ సందర్భంగా స్థానిక బుద్ధా పార్కులో సోమవారం లబ్ధిదారుల సమావేశం జరిగింది. ప్రభుత్వాలు మారుతున్నా తమ సమస్యకు మోక్షం కలగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సొసైటీకి సంబంధించిన నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడుగా సికిలే జయరాం, వైస్ ప్రెసిడెంట్‌గా యాళ్ళ మీరయ్య, సెక్రటరీగా కొట్నాల రోహిత్, సభ్యులుగా ఎలిపే కోటేశ్వరరావు, పెట్ట హరిబాబు, సబ్బతి కృష్ణ, ఎలిపే రాజేష్ ఎంపికయ్యారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - యానాం

నియోజకవర్గంలో 11 కెవి విద్యుత్ వైర్ల నిర్వహణ, విద్యుత్ లైన్లపై ఉన్న చెట్లను తొలగించేందుకు మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వెంకట్‌నగర్, గాంధీనగర్, టీచర్స్ కాలనీ, పిల్లారాయ వీధి, అన్యం గార్డెన్స్, జిక్రియా నగర్, వికాస్ కాలనీ, చింతా వారి వీధి, కొత్తపేట, సిద్ధార్థ నగర్, కాకి వారి వీధి, చిన్న సెంటర్, రవీంద్ర నగర్, విష్ణాలయం వీధి,కామిశెట్టి వారి వీధి, దోబీ స్ట్రీట్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

అబుల్ కలాం ఆజాద్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

సమాచార శాఖ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఫెర్రీ రోడ్డు, సిరాజ్ గార్డెన్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఆర్‌ఎఒ మునిస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, ఆసుపత్రి డిడి టి రవిశంకర్, ఎస్‌పి రాజశేఖరన్, గిడ్ల చంద్రరావు, కెఎల్‌వి.ప్రసాద్ పాల్గొన్నారు.

ఇసుక మాఫియాను అరికట్టాలి

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - కాకినాడ

ఇసుక మాఫియాను అరికట్టి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని ఎపి భవన నిర్మాణ కార్మికుల సంఘం కోరింది. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చెక్కల రాజ్‌కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నిట్ల శ్రీను, రొంగల ఈశ్వరరావు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా ఇసుక సరఫరా నిలిచిపోవడంతో జిల్లాలో నిర్మాణ రంగంపై ఆధారపడిన 53 రకాల వృత్తులు చేసుకునే రెండు లక్షల మంది కార్మికులకు ఉపాధి కరువైందన్నారు. గోదావరి పరివాహక ప్రాంతాలలోని అన్ని ఇసుక రీచ్‌లను తక్షణం ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అరకొరగా దొరికే ఇసుకను మధ్య దళారీలు అధిక ధరలకు అమ్ముతూ నిర్మాణ దారులను దోచుకుంటున్నారని, తక్షణం ఇసుక మాఫియా ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉచిత ఇసుక విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం పేదల గృహ నిర్మాణాలకు సబ్సిడీపై బ్యాంకు రుణాలు అందించడం ద్వారా నిర్మాణ రంగంపై ఆధారపడిన భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. కూటమి నేతలు ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని, సంక్షేమ బోర్డుకు నిధులు కేటాయిస్తామని, జగన్ ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని సరిచేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొని అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా నేటికీ సంక్షేమబోర్డు ఊసు ఎత్తడం లేదని విమర్శించారు. కార్మికుల సంక్షేమ పథకాల కోసం ఉద్యమానికి సిద్ధపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు నాగు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - శంఖవరం

విద్యార్థులు తమ స్వీయ రక్షణకు చట్టాలపై అవగాహన పెంచుకోవడం అవసరమని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ పిఒ విజయ అన్నారు సోమవారం స్థానిక కస్తూరిబా గాంధీ పాఠశాల ఆవరణలో జరిగిన బేటి బచావో బేటి హటావో కార్యక్రమంలో ఆమె పాల్గొని బాలల హక్కులు, చట్టాలు, బ్యాడ్ టచ్ మరియు గుడ్ టచ్, హెల్త్ అండ్ ప్రొటెక్షన్, బాల్య వివాహాలు, వాటి వల్ల జరిగే అనర్థాలపై వివరించారు. ఎంఇఒ ఎస్‌వి.వెంకట రమణ చైల్డ్ సేఫ్టీ, విద్య యొక్క ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలికల అభివృద్ధి అధికారి ఉమామహేశ్వరి, ప్రిన్సిపల్ బాలమణి పాల్గొన్నారు.

అర్జీదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజల నుంచి వస్తున్న అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు 361 అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిచ్చి సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల్లో నమోదైన అర్జీలపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అర్జీదారుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అన్నారు. అర్జీల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ జె.వెంకటరావు, హౌసింగ్ పీడీ ఎన్‌వివి.సత్యనారాయణ, జెడ్‌పి సిఇఒ వివిఎస్.లక్ష్మణరావు, కెఎస్ఇజెడ్ ఎస్‌డిసి రామలక్ష్మి, సిపిఒ పి.త్రినాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

లీకులతో తాగునీరు కలుషితం

ప్రజాశక్తి - సామర్లకోట

టీకా మందుల ఉత్పత్తి కేంద్రం వద్ద బురదలో ఉన్న ఎయిర్ వాల్వ్

పెద్దాపురం పట్టణ ప్రజలకు సరఫరా చేసే తాగునీటి పైపు లైన్‌కు సామర్లకోటలో ఏర్పడిన లీకులతో తాగునీరు కలుషితం అవుతోంది. కళ్లేదుటే లీకేజీలు కన్పిస్తున్నా సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కలుషితమైన తాగునీటినే ప్రజలు వినియోగించాల్సిన దుస్థితి నెలకుంది. కాకినాడ రోడ్డులోని మహర్షి సాంబమూర్తి రిజర్వాయర్ వద్ద ఏర్పాటుచేసిన ఫిల్టర్ బెడ్ చెరువు నుంచి సామర్లకోట మీదుగా పెద్దాపురం పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా అవుతోంది. సుమారు 3 దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన పైప్‌లైనుకు సామర్లకోట నుంచి పెద్దాపురం వెళ్ళేలోగా పలుచోట్లా లీకులు ఏర్పడి విలువైన తాగునీరు భారీగా వృధా అవుతుండటంతో పాటు పైపు లైను లీకుల ద్వారా వ్యర్థజలాలు తాగునీటిలో కలిసి అవి కలుషితం అవుతున్నాయి. ప్రధానంగా సామర్లకోట రాజీవ్ గృహకల్ప ఎదురుగా కోళ్ల టీకా మందుల ఉత్పత్తి కేంద్రం వద్ద ఉన్న పైపులైను ఎయిర్ వాల్ సంవత్సరాల తరబడి లీకవుతూ విలువైన తాగునీరు వృధాతో పాటు కలుషితం అవుతోంది. అయినా పెద్దాపురం మున్సిపల్ అధికారులు ఏమాత్రం పట్టించు కోవడం లేదు. అలాగే సామర్లకోట విమల్ బాట్లింగ్ కంపెనీ ఎదురుగా సుమారు నెల రోజుల క్రితం నుంచి పైపులైనుకు లీకులు ఏర్పడి భారీగా తాగునీరు వృధా అవుతుంది. ఈ విషయం పలుమార్లు అధికారుల దృష్టికి వెళ్లినా పట్టించుకోవడం లేదు. ప్రజలు జ్వరాలు, పచ్చ కామెర్లు వంటి బలహీనతలతో పెద్దాపురం ఆసుపత్రిలో చికిత్సలు పొందు తున్నారు. అయినా ఇక్కడ అధికారుల తీరు మారడంలేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇకనైనా సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి పైపులైను లీకులు అరికట్టి ప్రజలకు ఆరోగ్య వంతమైన తాగునీటిని అందించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

బ్యాంక్ సేవలు విస్తృతం చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

కేకును కట్ చేస్తున్న చిరంజీవినికుమారి

యూనియన్ బ్యాంక్ సేవలను విస్తృతం చేయాలని డిఆర్ఒ కె.వెంకట్రావు, సిపిఒ త్రినాథ్, ఐడియల్ విద్యా సంస్థలు ఛైర్మన్ డాక్టర్ పి.చిరంజీవిని కుమారి అన్నారు. యూనియన్ బ్యాంక్ 105వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు కలెక్టరేట్ బ్యాంక్ శాఖలో సోమవారం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి ఖాతాదారులకు, బ్యాంక్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనియన్ బ్యాంకు కలెక్టరేట్ శాఖ ఖాతాదారులకే కాకుండా ప్రభుత్వ ఉద్యోగులకు కూడా నమ్మకమైన సేవలు అందిస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ సురేష్ కుమార్, శివకుమార్, విజయ్ కుమార్, అశోక్, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సొసైటీ భవన నిర్మాణం

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి సంబంధించిన ఖాళీ స్థలంలో సొంత భవనం నిర్మించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని డివిజన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు, ఆర్‌డిఒ శ్రీ రమణి తెలిపారు. సోమవారం ఆమె అధ్యక్షతన స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి సంబంధించిన ఖాళీ స్థలంలో కార్యాలయ భవనం నిర్మించేందుకు ఒక స్వచ్ఛంద సంస్థకు చెందిన ప్రతినిధులు ముందుకు వచ్చారన్నారు. ఈ భవన నిర్మాణంకు సంబంధించి సభ్యులతో చర్చించి వారి అభిప్రాయాలను తీసుకున్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, డిప్యూటీ తహశీల్దార్ భానుకుమార్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ప్రధాన రహదారి

ప్రజాశక్తి - జగ్గంపేట

రహదారిలో పడిన గుంత

మండలంలోని భావవరం గ్రామ శివారు ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు నేలకు కూలింది. ఈ రహదారిలో వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. రాత్రి సమయాల్లో రైతులు తమ తమ పొలాల నుంచి ఇంటికి వెళ్లే సమయంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదకర ప్రాంతంలో కనీసం హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు చోటుచేసకుంటున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

14న జరిగే ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పెద్దాపురం

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం చేపట్టిన ప్రజా పోరు కార్యక్రమంలో భాగంగా ఈ నెల 14న స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో నీలపాల సూరిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రజాపోరు పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి పార్టీలు ప్రజలకు అనేక హామీలు ఇచ్చాయని, అధికారంలోకి వచ్చాక ఆ హామీలను పట్టించుకోవడం లేదన్నారు. గత ప్రభుత్వంలో విద్యుత్ ఛార్జీల పెంపుదలపై గొగ్గోలు పెట్టిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక విద్యుత్ వినియోగదారులపై ట్రూ అప్ ఛార్జీల పేరుతో రూ.20 వేల కోట్ల భారాన్ని వేసేందుకు సిద్ధపడటం దారుణమ న్నారు. నిత్యావసర వస్తువుల ధరలన్నీ విపరీతంగా పెరిగిపోయాయన్నారు. ఉచిత ఇసుక పేదలకు అందనంత దూరంలో ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై జరుగుతున్న ప్రజా పోరులో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కేదారి నాగు, సిరపరపు శ్రీనివాస్, చల్లా విశ్వనాథం పాల్గొన్నారు.

పలువురిని పరామర్శించిన మాజీ ఎంఎల్ఎ పొన్నాడ

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలో పలు కుటుంబాలను మాజీ ఎంఎల్ఎ పొన్నాడ సతీష్‌కుమార్, వైసిపి నాయకులు పితాని బాలకృష్ణ సోమవారం పరామర్శించారు. మాతృవియోగంతో బాధపడుతున్న నీలపల్లి వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులు కట్ట దుర్గారావును పరామర్శించారు. ఇంజరం గ్రామంలో అమలాపురపు సత్యనారాయణ కుటుంబాన్ని, చిన్న బొడ్డు వెంకటాయ పాలెంలో మల్లాడి సత్తిబాబు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ పర్యటనలో వైస్ ఎంపిపి కొపనాతి లలిత, నాగరాజు, సర్పంచ్ పెయ్యాల మంగేష్, ఎంపిటిసి సభ్యులు గుత్తుల శ్రీనివాస్, బిసి. సెల్ సెక్రటరీ రెడ్డి సతీష్, మండల కార్యదర్శి మోకా మధుబాబు, ఇంజరం గ్రామ కమిటీ అధ్యక్షులు పెయ్యల కొండబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి. - గొల్లప్రోలు

బాలల దినోత్సవం సందర్భంగా చేబ్రోలు జడ్‌పి ఉన్నత పాఠశాలలో సిఐటియు. ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'జవహర్ లాల్ నెహ్రూ జీవిత చరిత్ర విశేషాలు, స్వతంత్ర ఉద్యమంలో నెహ్రూ పాత్ర' అనే అంశంపై 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. బాలల దినోత్సవం రోజు విజేతలకు బహుమతులు అందజేస్తామని సిఐటియు నాయకులు ఒ.నందీశ్వరుడు, కె.చిన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కె.కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

గురజనాపల్లిలో రీ సర్వే గ్రామ సభ

ప్రజాశక్తి - కరప

మండలంలోని గురజనాపల్లి గ్రామంలో సోమవారం రీ సర్వే గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా తహశీల్దార్ ఎన్.సత్యనారాయణ రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో 41 అర్జీలు వచ్చాయని, ఇప్పటి వరకూ నిర్వహించిన 19 గ్రామ సభల్లో 1041 అర్జీలు వచ్చాయని తెలిపారు. మరో 3 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వ హించాల్సి వుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటి, మండల సర్వేయర్, ఆర్ఐ, విఆర్ఒ, గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ఎన్‌టిఆర్ కాంస్య విగ్రహం వద్ద సోమవారం అన్నదానం కార్యక్రమం జరిగింది. దాతలు కేంగం రమణ, కేంగం రామకృష్ణ ఆర్థిక సాయంతో పేదలకు ఉచిత భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్‌విఎస్.అప్పలరాజు, మండల టిడిపి అధ్యక్షులు మారిశెట్టి భద్రం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బుర్రి సత్తిబాబు, కేంగం రామకృష్ణ, వేములకొండ జోగారావు, మారిశెట్టి గంగ, బద్ది సురేష్, కోడూరి రమేష్, ప్రేమ స్వరూప్ బుజ్జి, పంపనబోయిన అప్పాజీ, పాల్గొన్నారు.

158 మంది టీచర్ ఎంఎల్‌సి ఓటర్లు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో టీచర్ ఎంఎల్‌సికి సంబంధించి 158 మంది ఓటర్లు ఉన్నారని తహశీల్దార్ సిహెచ్ వెంకటలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. డిసెంబర్ 5న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ జరుగుతుందన్నారు. 9వ తేదీన కౌంటింగ్ ప్రారంభం అవుతాదని తెలిపారు. ప్రస్తుత టీచర్ ఎంఎల్‌సికి సంబంధించి 144 ఓట్లు నమోదు కాగా, మరో 14 ఓట్లు చేరుతాయని చెప్పారు. ఈ సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీకుమారి, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

రుడా ఛైర్మన్ బొడ్డుకు అభినందనల వెల్లువ

ప్రజాశక్తి - పెదపూడి

రాజమహేంద్రవరం అర్బన్ అథారిటీ ఛైర్మన్‌గా నియమితులైన బొడ్డు వెంకటరమణ చౌదరిని పలువురు కలిసి అభినందనలు తెలిపారు. సోమవారం పెద్దాడలోని ఆయన నివాసంలో పలువురు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. రుడా ఛైర్మన్‌ను కలిసిన వారిలో పుట్టకొండ సర్పంచ్ వెంకటరమణ, ఉప సర్పంచ్ మిరియాల శ్రీనివాసరావు, రేషన్ డీలర్స్ యూనియన్ నాయకులు రవిలతోపాటు, సామర్లకోట, వేట్లపాలెంకు ఒదిన నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

పూజలు చేస్తున్న ఎస్‌పి దంపతులు

భీమేశ్వరస్వామిని దర్శించుకున్న ఎస్‌పి దంపతులు

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక భీమేశ్వర ఆలయం భక్తులతో కిట కిటలాడింది. సోమవారం జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ దంపతులు ఆలయాన్ని సందర్శించారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఇఒ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అలాగే ఎంఎల్ఎ నిమ్మకాయల చిన్నరాజప్ప ఆలయంలో పూజలు చేశారు. భక్తులకు భీమేశ్వర లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పులిహోర వితరణ చేపట్టారు. సిఐ ఎ.కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మహారాజశ్రీ అమలాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
ఐ.ఎ.నెం.317/2021ఇన్
ఓ.ఎస్.నెం.36/2021

బిట్వీన్:
వాడ్రేవు సీతారామాంజనేయ ప్రసాద్ ...పిటిషనరు-వాది
మరియు
గిడుగు అనంతలక్ష్మి మరియు 2 అదర్స్ ...రెస్పాండెంట్లు-ప్రతివాద్లు
2. గిడుగు శివ లక్ష్మి బాల విజయ ప్రశాంతి,తండ్రి (లేటు) నాగేశ్వరరావు, w/o.వేణుమాధవ,డోరు నెం.4-150, గిడుగు వారి పాలెం, మొండెపులంక, పి.గన్నవరం మండలం
3. గిడుగు దేవి రమామణి, తండ్రి (లేటు) నాగేశ్వరరావు, డోరు నెం.4-150, గిడుగు వారి పాలెం, మొండెపులంక, పి.గన్నవరం మండలం
...2,3 రెస్పాండెంట్లు-ప్రతివాదులు

ఈ నంబరులో వాది, చనిపోయిన మీ తండ్రి లేటు గిడుగు నాగేశ్వరరావు గారి నుండి తనకు రావలసిన ప్రోనోటు బాకీ వసూలు నిమిత్తం ఆయిన యొక్క వారుసులైన మీపై, మీ తల్లి గారిపై దాఖలు చేసిన దావాలోని, నాగేశ్వరరావు గారి అస్తులను ఎటాచ్‌మెంటు చేయమని దాఖలు చేసిన పై నంబరు పిటిషనులో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపించినను తీసుకోనందున కోర్టు వారు పబ్లికేషను ద్వారా నోటీసులు ఆర్డరు వేసినారు. సదరు పిటీషను వాయిదా **22-11-2024** అయి ఉన్నది.
కావున సదరు తేదిని పై కోర్టు వారి ఎదుట ఉదయం గం.**10.30**లకు స్వయంగా గాని ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మనవి చేసుకోవలెను. లేనిచో పిటిషను పరోక్షమందు తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు //
ఎన్.వి.కె.శర్మ
అడ్వకేట్, అమలాపురం
సెల్. 9849142007,9849276623

మహారాజశ్రీ ముమ్మిడివరం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S. No. 7/2024

Between:
గుత్తుల రవీంద్రనాథ్ -వాది
AND
కొల్లూరి సతీష్ -ప్రతివాది
టు:
కొల్లూరి సతీష్, S/o. బుల్లి హనుమంతరావు, డో.నెం. 11-2-32, నల్లవంతెన ఏరియా, అమలాపురం, అమలాపురం మున్సిపాలిటీ, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, AMP Prl. Jr.C.J.

ఈ పై నెంబర్ దావాను వాది మీపై మీరు వ్రాయించి ఇచ్చిన ప్రామిసరీ నోటు బాకీ అసలు ఫాయిదాలు తాలూకు వసూలు మున్నగు పరిహారములు కోరుచూ దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు సమన్లు నిమిత్తం మరియు మీ హాజరు నిమిత్తం **వాయిదా 02-12-2024వ తేదీ అయి వున్నది. కావున మీరు వాయిదా రోజున ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ వారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. అట్లు కాని ఎడల మీ పరోక్షమందున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)
శ్రీ కుచ్చర్లపాటి తాతంరాజు
శ్రీ గుత్తుల శ్రీనివాసరావు
అడ్వకేట్స్, ముమ్మిడివరం
ముమ్మిడివరం సెల్:9440041751
ది.11-11-2024 9440528135

మహారాజశ్రీ రాజమండ్రి 2వ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 38/2024

Between:
Marre Krishnaveni ***...Plaintiff***
AND
To:
Adapa Anantha Lakshmi, W/o. Durga Prasad, D.No. 78-1-7, Syamala Nagar, Rajahmundry
...1st Defendant

పై నెంబరు దావాలో 1వ ప్రతివాది అయిన మీకు దావా సమన్లు అమలు జరుగుటకు గాను **14-11-2024కి వాయిదా అయి వున్నది.** అందు విషయమై మీకు ఏమయినా ఆక్షేపణలు ఉన్నచో వాయిదా రోజున **ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరు అయి తెలియపర్చుకోవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

(By Order of the Court)
K.V.V.S.PRASAD
Advocate
రాజమండ్రి Danavaipeta
ది.10-11-24 Rajahmundry-3

IN THE HONOURABLE COURT OF THE III ADDL. JUNIOR CIVIL JUDGE AT :: VISAKHAPATNAM
O.S.No. 477 of 2024

Between :
D. Raja Sekhar ... Plaintiff
And
M. Srinivasa Reddy ... Defendant

NOTIECE

To,
Mallidi Srinivasa Reddy S/o. M. Surapu Reddy Residing at D.No.7-16-2/1, Drivers Colony, Old Gajuwaka, Visakhapatnam, Pin - 530026.
Presently Residing at D.No. 7-543, Ramareddy Nagar, Anaparthy, East Godavari Dist - 533342.

Please take Notice that above matter Stands posteed to **12-12-2024** for appearance of the defendant and he shoudappear before the above Hon'ble Court on that day in Person or through an Advocate, and if fails to appear on that day at 10-30 a.m. The matter will be heard and decided exparte.

P. SURYA NARAYANA
Advocate
Visakhapatnam